నేడు ఎంసెట్ ఫలితాలు

- 9.30 గంటలకు విడుదల చేయనున్న మంత్రి సబిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంసెట్ రాతపరీక్షల ఫలితాలు గురువారం ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని జెఎన్ఎఎఫ్ఎయులో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, జెఎన్‌టియు హైదరాబాద్ విసి కట్టా నర్సింహారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈనెల 10,11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, 12 నుంచి 14వ తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఎంసెట్‌కు 3,20,683 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, వారిలో 3,01,789 (94.11 శాతం) మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. 18,894 మంది గైర్హాజరయ్యారు.

పోస్టాఫీసుల్లో మహిళా సమ్మాన్ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల చిన్న మొత్తాల పొదుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్స్' రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉన్నాయని ఇండియాపోస్ట్ హైదరాబాద్ సిటీ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఏ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ పథకంలో మహిళలు తమ కోసం లేదా మైనర్ బాలికల తరపున ఖాతాను తెరవవచ్చని తెలిపారు. కనిష్టంగా వెయ్యిరూపాయలు, గరిష్టంగా రెండు లక్షల వరకు డిపాజిట్ చేయొచ్చు. ఖాతా మెచ్యూరిటీ వ్యవధి రెండేళ్లు, గరిష్ట పరిమితికి లోబడి ఒక్కరు ఎన్ని ఖాతాలైనా మూడు నెలల తర్వాత తెరవవచ్చు. ఈ పథకం కింద డిపాజిట్లకు వర్తించే వడ్డీ రేటు సంవత్సరానికి 7.5 శాతం ఉంటుంది. ప్రతి మూడునెలలకు ఒకసారి వడ్డీని లెక్కించి ఖాతాలో జమచేస్తారు. ఖాతా తెరిచిన తేదీ నుంచి ఏడాది గడువు ముగిసిన తర్వాత, ఆ సొమ్ములో గరిష్టంగా 40 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. ఇతర వివరాలకు సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలివ్వాల్సిందే

- లెఫ్ట్ తోడ్పాటుంటే బిఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

రాష్ట్రంలో కమ్యూనిస్టుల తోడ్పాటు ఉంటే బిఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు వచ్చే అవకాశముందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఆ ప్రభావం ఉంటుందని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశానంతరం బుధవారం తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించామని చెప్పారు. రాజకీయ బలాబలాలను అంచనా వేశామన్నారు. ప్రస్తుతానికి బిఆర్ఎస్ మొదటిస్థానంలో, కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంటాయని వివరించారు. అయితే బిఆర్ఎస్ ప్రభుత్వంపై కొన్ని సెక్షన్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదని అన్నారు. పదేండ్ల నుంచి అధికారంలో ఉండడం వల్ల సహజంగానే అసంతృప్తి ఉంటుందన్నారు. అయితే కెసిఆర్ ప్రభుత్వం చేసిన వాగ్ధానాలను అమలు జరపకపోవడం వల్ల, అనేక విషయాల్లో అప్రజాస్వామిక పద్ధతులను అవలంభించడం కారణంగా ఈ అసంతృప్తి పెరుగుతోందని చెప్పారు. ఇటీవల కొన్ని సెక్షన్ల డిమాండ్లు నెరవేర్చడంపై సిఎం కెసిఆర్ దృష్టి సారించారని వివరించారు. విఆర్ఎలు, జెపిఎస్‌లు, కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ, బిసిలకు లక్ష రూపాయల సాయం వంటి చర్యలతో ఈ అసంతృప్తి కాస్త తగ్గిందన్నారు. వచ్చేనెల 24 నుంచి పోడు భూములకు పట్టాలను పంపిణీ చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడం శుభపరిణామమేగానీ, ఎంత మందికి ఇస్తారనే దానిపై అయోమయం సరికాదన్నారు. అర్హత ఉన్న గిరిజనులందరికీ పోడు పట్టాలు వస్తాయా?అన్నది చర్చనీయాంశంగా మారిందని చెప్పారు. 11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలివ్వాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. మూడు, నాలుగు లక్షల ఎకరాలకు పట్టాలిస్తారంటూ ప్రచారం జరుగుతున్నదని, అదే నిజమైతే దాన్ని సరిచేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పీఆర్సీ, డీఏల మంజూరు, ఇతర సమస్యలు, కార్మికులకు కనీస వేతనాల జీవో సవరణ, పంచాయతీ కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాలపై సిఎంను కలిసి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాలంటూ తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం నిర్ణయించిందన్నారు.

రాజకీయ లబ్ధికోసమే రూ.2 వేల నోట్ల రద్దు

రూ.రెండు వేల నోట్ల రద్దు అనవసర చర్య అని తమ్మినేని విమర్శించారు. రాజకీయ లబ్ధి పొందడం కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. దీనివల్ల నల్లధనం నియంత్రణ, దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడేది ఏమీ లేదని చెప్పారు. గతంలో రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేసినప్పుడే అది రుజువైందని వివరించారు. ఇప్పుడు రూ.రెండు వేల నోట్లు రద్దు చేయడం వల్ల వచ్చే ప్రయోజనం శూన్యమని విమర్శించారు. రాష్ట్రాల స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా అన్ని శక్తులూ ఏకం కావాలని చెప్పారు. ఎన్నికల తర్వాత బిజెపియేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సరైన మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులుతోపాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఉరివేసేందుకు మోడీ కుట్ర

- ఏటా నిధుల కేటాయింపులో కోత : బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులతో మాట్లాడుతున్న బి వెంకట్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి ఉపాధికి ఉరేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని గణపవరం, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను ఆయన సందర్శించారు.

కార్మికులతో మాట్లాడారు యుపిఎ ప్రభుత్వం హయాంలో పోరాడి సాధించుకున్న చట్టాన్ని మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక అనేక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. బడ్జెట్‌లో నిధులను కుదించి ఈ పథకాన్ని క్రమంగా కార్మికులకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా కేంద్ర బడ్జెట్‌లో రెండు లక్షల 50 వేల కోట్లు కేటాయించాల్సింది పోయి ఈ ఏడాది రూ.65 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్షాల వల్ల సాధించుకున్న ఈ చట్టాన్ని నీరుగారిచ్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఉపాధి చట్ట రక్షణ కోసం జరిగే ఉద్యమంలో వ్యవసాయ కూలీలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగటంతో పని దినాలు పడిపోతున్నాయని, ఫలితంగా వ్యవసాయ కార్మికులు వలసలు పోతున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించేందుకు సంవత్సరానికి ఉపాధి హామీలో 200 రోజులు పని దినాలు.. రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ పర్యటనలో ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు వేలిది పద్మావతి, సిపిఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు సోమపంగు జానయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పటాన్ మైబెల్లి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నందిగామ సైదులు తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌లో స్టెమ్‌క్యూర్స్ ల్యాబ్

దేశంలోనే అతిపెద్ద ప్రయోగశాల ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకు మరో పెట్టుబడి రానుంది. స్టెమ్ క్యూర్స్ కంపెనీ హైదరాబాద్‌లో తయారీ ల్యాబ్‌ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ ల్యాబ్ ప్రధానంగా స్టెమ్ చికిత్సపై దృష్టి సారిస్తుంది. ఇది భారతదేశంలోనే అతిపెద్ద స్టెమ్ సెల్ మ్యానిఫ్యాక్చరింగ్ ప్లాంట్. దాదాపు 54 అమెరికన్ మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ తయారీ యూనిట్‌తో 150 మందికిపైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కెటిఆర్ స్టెమ్ క్యూర్స్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సాయిరాం అట్లూరితో బోస్టన్ నగరంలో సమావేశం అయ్యారు. అమెరికాలో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని నైపుణ్యాన్ని భారతదేశానికి తీసుకొచ్చి తీవ్రమైన వ్యాధులకు స్టెమ్ సెల్ ఉత్పత్తులతో చికిత్సను అందించడమే ఈ కంపెనీ లక్ష్యం.

ప్రపంచ మెడికల్ ఇన్నోవేషన్‌కు తన సొంత నగరమైన హైదరాబాద్ హబ్‌గా మారిందని సాయిరాం అట్లూరి సంతోషం వ్యక్తం చేశారు. తమ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యంగా మంత్రి కెటిఆర్ అందిస్తున్న సహకారానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

స్టెమ్ క్యూర్స్ కంపెనీని హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్టు మంత్రి కెటిఆర్ తెలిపారు. కంపెనీ పెట్టుబడి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన సంస్థకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అత్యంత తీవ్రమైన వైద్య, ఆరోగ్య సమస్యలకు స్టెమ్ సెల్ థెరపీతో పరిష్కారం లభిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఈ అత్యాధునిక చికిత్సా విధానాలు దేశంలో విస్తృతంగా అందుబాటులోకి రావాలన్నారు. స్టెమ్ క్యూర్ సంస్థ ఏర్పాటు చేయనున్న ల్యాబ్‌తో దేశంలో ఈ చికిత్సా విధానాలు అందరికి అందుతాయన్న ఆశాభావాన్ని మంత్రి కెటిఆర్ వ్యక్తం చేశారు.

రాష్ట్రపతిని అవమానించిన ఆర్ఎస్ఎస్, బిజెపి

- బెల్లయ్యనాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా ఆర్ఎస్ఎస్, బిజెపి అవమానించాయని టిపిసిసి ఆదివాసీ కాంగ్రెస్ చైర్మెన్ బెల్లయ్య నాయక్ విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్రౌపది ముర్ము చేతనే పార్లమెంటు భవనాన్ని ప్రారంభింపజేయాలని డిమాండ్‌తో 25న జిల్లా కేంద్రాల్లో, 26న మండల కేంద్రాల్లో మీడియా సమావేశాలు, 27న రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద, 28న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ మాట్లాడుతూ, ఆదివాసుల ఓట్ల కోసమే ద్రౌపది ముర్మును రాష్ట్రపతి చేశారని, పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి ఆమెను ఆహ్వానించకుండా ఆదివాసీలను అవమానించారని విమర్శించారు.

భారత్‌లో టెస్లా కార్యకలాపాలకు సిద్ధం

- ఎలన్ మస్క్ వెల్లడి

వాషింగ్టన్ : విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ టెస్లా భారత్‌లో ప్లాంట్ ఏర్పాటుపై ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. ఎప్పటి నుంచో ఊగిసలాటలో ఉన్న ఆ కంపెనీ అధినేత ఎలన్ మస్క్ అమెరికన్ మీడియాతో తప్పకుండా భారత్‌లో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఎక్కడ ఏర్పాటు చేసేది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఫ్యాక్టరీకి అనువైన పలు ప్రాంతాలను పరిశీలిస్తున్నామన్నారు. భారత్‌లో ప్లాంట్ నెలకొల్పే విషయంలో ఇప్పటికే టెస్లా ప్రతినిధులు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. 2024 కార్ల ఉత్పత్తిని ప్రారంభించి.. 2025 నాటికి భారత్‌లో అమ్మకాలు చేయాలని ఆ కంపెనీ వర్గాలు భావిస్తున్నాయి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ప్రోగ్రామ్

ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ యువ గ్రాడ్యుయేట్లను ఒక ఏడాది లోగా బ్యాంకింగ్ నిపుణులుగా మార్చేందుకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ప్రోగ్రామ్ 'ఫ్యూచర్ బ్యాంకర్స్ 2.0'ని ప్రారంభించినట్లు తెలిపింది. మణిపాల్ గ్లోబల్ అకాడమీలోని బిఎఫ్ఎస్ఐతో కలిసి నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఒక ఏడాది కాలపరిమితితో ప్రొఫెషనల్ డిప్లమో కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపింది. విజయవంతమైన అభ్యర్థులందరికీ రూ.5.59 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుందని వెల్లడించింది. ఆసక్తి కలిగిన వారు 'హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఫ్యూచర్ బ్యాంకర్స్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

చమురు ధరలు పెరుగొచ్చు

ఉత్పత్తికి ఒపెక్ కోత..!

న్యూయార్క్ : అంతర్జాతీయంగా చమురు వ్యాపారులు ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ధరలు పెరిగే అవకాశం ఉందని రిపోర్టులు వస్తున్నాయి. చమురు ఎగుమతి దేశాలు (ఒపెక్) మరోసారి ఉత్పత్తికి కోత పెట్టే అవకాశం ఉందని సౌది ఇంధన శాఖ మంత్రి ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ బిన్ సల్మాన్ చేసిన వ్యాఖ్యలతో మంగళవారం ఫ్యూచర్ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయి. జూలై డెలివరీ కోసం వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యుఐటి) న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజీలో బ్యారెల్‌కు 86 సెంట్లు లేదా 1.19 శాతం పెరిగి 72.91 యుఎస్ డాలర్ల వద్ద ముగిసింది. జూలై డెలివరీ కోసం బ్రెంట్ క్రూడ్ 85 సెంట్లు లేదా 1.12 శాతం పెరిగి లండన్ ఫ్యూచర్స్ ఎక్స్ఛేంజీలో బ్యారెల్ 76.84 డాలర్ల వద్ద నమోదయ్యింది. వచ్చే నెలలో పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్) భాగస్వాముల భేటీకి ముందు సౌదీ మంత్రి ప్రకటనతో ఉత్పత్తి తగ్గింపునకు అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

వ్యవసాయ పెట్టుబడుల్లో 22% పెరుగుదల : ఎఫ్ఎఒ

రోమ్ : గతేడాది ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ రంగ వ్యవస్థల్లో పెట్టుబడులు ఐదో వంతు మేర పెరిగాయని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఒ) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఎఫ్ఎఒ ఇన్వెస్ట్‌మెంట్ సెంటర్ మంగళవారం విడుదల చేసిన 2022 వార్షిక సమీక్ష ప్రకారం.. 2022లో స్థిరమైన వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు 22 శాతం పెరిగాయి. 32 దేశాల్లో దాదాపు 45 పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రాజెక్టులను ఎఫ్ఎఒ ఇన్వెస్ట్‌మెంట్ సెంటర్ పర్యవేక్షిస్తుంది. 2022లో 8.8 బిలియన్ యుఎస్ డాలర్ల విలువ చేసే పెట్టుబడులు చోటు చేసుకున్నాయని ఆ రిపోర్ట్ పేర్కొంది. ఆరోగ్యకరమైన, మరింత స్థిరమైన భవిష్యత్తు కోసం ఈ రంగంలోని ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి కలిసికట్టుగా, వేగంగా పని చేయాలని ఎఫ్ఎఒ డైరెక్టర్ జనరల్ క్యూ డాంగ్యు పేర్కొన్నారు. దశాబ్దాలుగా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో దీర్ఘకాలికంగా పెట్టుబడి పెట్టేందుకు ఎఫ్ఎఒ సహాయం చేస్తుంది.

కుమ్మిన్స్ ఇండియా 650% డివిడెండ్

పూణె : డీజిల్, గ్యాస్ ఇంజిన్లను తయారు చేసే కుమ్మిన్స్ ఇండియా తన వాటాదారులకు మెరుగైన డివిడెండ్‌ను ప్రకటించింది. 2022-23కు గాను రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.13 లేదా 650 శాతం డివిడెండ్‌ను అందించడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ఇంతక్రితం ఫిబ్రవరిలో కూడా ఆ సంస్థ రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను అందించింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఈ సంస్థ 29 శాతం వృద్ధితో రూ.1,889 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. నికర లాభాలు 68 శాతం పెరిగి రూ.319 కోట్లకు చేరాయి.

వైభవంగా దశాబ్ది ఉత్సవాలు

- ఏర్పాట్లపై సిఎస్ శాంతికుమారి సమీక్ష

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారుల్ని ఆదేశించారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా పూర్తిచేయాలని, నిర్వహణలో ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని చెప్పారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలంయంలో బుధవారం దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం ఆమె నిర్వహించారు. డిజిపి అంజనీ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అర్వింద్‌కుమార్, సునీల్‌శర్మ, జిఏడి కార్యదర్శి శేషాద్రి, హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ సివి ఆనంద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర సచివాలయ ఆవరణలో మొదటిసారిగా ఈ ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు, సచివాలయ, జిహెచ్‌ఎంసి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున సచివాలయంలోకి వారి ప్రవేశం, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను జాగ్రత్తగా పర్యవేక్షించాలని చెప్పారు. సెర్మోనియల్ పరేడ్ నిర్వహణ, జాతీయ పతాకావిష్కరణ ఏర్పాట్లు చేయాలన్నారు. షామియానాలు, సీటింగ్ ఏర్పాట్ల బాధ్యతల్ని రోడ్లు, భవనాల శాఖ అధికారులు చేపట్టాలని ఆదేశించారు. సచివాలయం, రాజ్‌భవన్, శాసనసభతో పాటు ఇతర ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు. జిహెచ్‌ఎంసి సమన్వయంతో గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి ఫ్లోరల్ డెకరేషన్ చేపట్టాలన్నారు. సమావేశ ప్రాంగణంలో ఎల్ఇడి స్క్రీన్ల ఏర్పాటు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాట్లు చేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్‌ను ఆదేశించారు. నగరంలోని చార్మినార్, క్లాక్ టవర్ తదితర ప్రముఖ భవనాలను ఉత్సవాలు జరిగే 21 రోజులపాటు విద్యుత్ దీపాలతో అలంకరించాలని మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. మంచినీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు చెప్పారు. ఈ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి సంబంధిత శాఖలు నోడల్ అధికారులను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, శ్రీనివాసరాజు, సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్ఏఎం రిజ్వి, అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, జైళ్ల శాఖ డిజి స్వాతి లక్రా, జలమండలి ఎండి దానకిషోర్, జిహెచ్‌ఎంసి కమీషనర్ లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ అశోక్ రెడ్డి, ఇఎన్‌సి గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంకెప్పుడు కొంటారు..?

- ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతుల ఆగ్రహం
- తడిచిన, మొలకెత్తిన ధాన్యం కొనట్లేదని ఆవేదన
- సొసైటీ కార్యాలయం ఎదుట ధాన్యం
- ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యానికి నిప్పు పెట్టిన నిరసన తెలుపుతున్న రైతులు

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్న పంటను అమ్ముకుందామంటే సొసైటీ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్ల తీరుతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. కొనుగోళ్లలో ఆలస్యం.. మిల్లర్ల దోపిడీతో సతమతమవుతుండగా.. మరోవైపు అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి రంగు మారి మొలకెత్తింది. అయితే, ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో జరగడం లేదు. దాంతో విసుగు చెందిన ఓ రైతు మొలకెత్తిన ధాన్యాన్ని బుధవారం సొసైటీ ఎదుట కుమ్మరించి తన ఆవేదన వ్యక్తం చేశాడు. మరోచోట క్వింటాకు 5 కిలోల తరుగు తీస్తుండటంతో రైతులు రాస్తారోకో చేశారు. ఇంకోచోట ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు వడ్లకు నిప్పు పెట్టారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...

నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రానికి చెందిన రైతు కుంట్ల సాయిలు ధాన్యం వర్షానికి తడిసి రంగు మారింది. దాన్ని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు తీసుకోవడం లేదని విసుగుచెంది బుధవారం ఒక ట్రాలీ లోడు ధాన్యాన్ని సొసైటీ ఎదుట గుమ్మరించాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ సందర్భంగా రైతు కుంట్ల సాయిలు మాట్లాడుతూ.. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయి రంగు మారడం, మొలకలు వచ్చాయని తెలిపారు. అయినా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నా కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

దీనిపై సాలుర సొసైటీ సెక్రటరీ బస్వంతరావును వివరణ కోరగా, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారుల నుంచి తమకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని చెప్పారు. అందువల్లే ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. ఈపాటికే సాలుర కొనుగోలు కేంద్రంలో 4 వేల బస్తాలకు పైగా మొలకెత్తిన ధాన్యం ఉందని తెలిపారు.

ఐదు కిలోల తరుగు తీయడంపై ఆగ్రహం

తరుగు పేరుతో క్వింటా ధాన్యానికి ఐదు కిలోలు తగ్గించడాన్ని నిరసిస్తూ రైతులు యాదాద్రిభువనగిరి జిల్లా అనాజిపురం స్టేజి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పరీక్షించిన తర్వాత సర్టిఫైడ్ చేసిన ధాన్యాన్ని మిల్లర్లు తరుగు పేరుతో ఐదు కిలోలు తగ్గించడం సరైనది కాదన్నారు. పోలీసులు, మిల్లర్ సంఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. తరుగు తీయబోమని చెప్పడంతో ధర్నా విరమించారు.

ధాన్యానిక నిప్పు పెట్టి రాస్తారోకో

మహబూబాబాద్ జిల్లా ఈదులపూసపెల్లి గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆగ్రహించిన రైతులు సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ శివారులో రహదారిపై పంటకు నిప్పు పెట్టి.. రాస్తారోకో చేశారు. సీఐ రమేష్ బాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి రైతులను సముదాయించారు. అధికారులు వస్తే తప్ప రాస్తారోకో విరమించేది లేదని రైతుల మొండికేశారు. దీంతో పీఏసీఎస్ అధికారులు వచ్చి.. నేటి నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

యాసంగి పంటలపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాసంగి పంటల సాగును ముందుకు జరిపేందుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగింది. దీనికి వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తెలంగాణ రాకతో వ్యవసాయ రంగ స్వరూపం పూర్తిగా మారిపోయిందని, సాగు నీరు, ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుభీమా, పంటల కొనుగోళ్లతో రైతులో ఆత్మస్థైర్యం పెరిగిందని అభిప్రాయపడ్డారు. కానీ యాసంగి వరి పంట కోతల ఆలస్యం కారణంగా అకాల వర్షాలతో రైతులతో పాటు ప్రభుత్వానికీ నష్టం జరుగుతుందని చెప్పారు. దీని నివారణకు యాసంగి పంట కాలాన్ని ముందుకు జరిపేందుకు ఏ రకమైన విధానాలు అవలంబించాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారుల్ని కోరింది. యాసంగి సాగులో యాజమాన్య పద్ధతులు, తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి ఇచ్చే వరి రకాల సాగు తదితర అంశాలపై చర్చించారు. దీనిపై శాస్త్రవేత్తలు, నిపుణులు, అధికారుల అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు. మరోసారి సమావేశమై మరింత లోతైన అధ్యయనం చేసి, సీఎం కేసీఆర్‌కు నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

- అందరూ అన్నదమ్ములే..
- బతుకుదెరువు కోసం వెళ్తుండగా ఔరంగాబాద్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లికి చెందిన నలుగురు మృతిచెందారు. మృతులు నలుగురూ ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఎరుకల కృష్ణ, సంజీవ్, సురేష్, వాసుగా పోలీసులు గుర్తించారు. అన్నదమ్ములు నలుగురూ కొన్నేళ్ల కిందట బతుకుదెరువు కోసం గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్లారు. ఐదురోజుల కిందట వీరి స్వగ్రామమైన చౌటపల్లిలో బంధువు ఎరుకల కనుకయ్య మృతిచెందారు. అతడి అంత్యక్రియల కోసం ఈ నలుగురూ కుటుంబ సభ్యులతో కలిసి చౌటపల్లికి వచ్చారు. కుటుంబ సభ్యులను చౌటపల్లిలోనే ఉంచి అన్నదమ్ములు తిరిగి సూరత్‌కు మంగళవారం కారులో బయల్దేరారు. అదే రోజు రాత్రి మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వద్ద కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. దాంతో స్వగ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

IN THE COURT OF THE HON'BLE VTH JUNIOUR CIVIL JUDGE:: CITY CIVIL COURT :: AT :: HYDERABAD
O.S.NO 5203 OF 2022

BETWEEN:

sardar Begum rep by its GPA
.. Plaintiff

AND

Mohammed Moizuddin and others
.. Defendant

To, Mohammed Moizuddin
S/o.Mohammed Ommer,
R/o. H.No:- 9-4-86/23, Salarjung colony, Golkondon, Hyderabad.

The Plaintiff filed the suit for Perpetual Injunction against you, and the said suit is coming for your counter and appearance since long time and finally the suit is posted for your appearance and Counter , if any on 06-06-2023. Otherwise the matter will be decided on merits.

// BY ORDER OF THE COURT//
COUNSEL FOR THE PLAINTIFF
J. VIJAY KUMAR GOUD
ADVOCATE
#18-8-303/A/6/A, Thanaji Nagar, Uppuguda, Hyderbad.
Cell: 9963908856/9505111572

వడదెబ్బతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతిస్థిమితం లేని వ్యక్తి వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఈ ఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలం మచ్చాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ సీహెచ్ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..ఆత్మకూరు మండలం నాగయ్యపల్లెకు చెందిన పోగుల ప్రభాకర్(62)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 21న ఆదివారం ఆత్మకూరు నుంచి నల్లబెల్లి బంధువుల వద్దకు వెళ్లిన ప్రభాకర్ అటు నుంచి ఇంటికి వెళ తున్నానని చెప్పి మచ్చాపూర్ వైపు వచ్చాడు. ఎండలు విపరీతంగా ఉండటంతో డిహైడ్రేషన్‌కు గురై మృతిచెందాడు. స్థానికులు గమనించి కటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ములుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు.

జులై 3న ఎఫ్‌టిసిసిఐ అవార్డుల ప్రదానం

- మే 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ : ఎఫ్‌టిసిసిఐ ఎక్సలెన్సీ అవార్డ్స్-2022 వాటాదారుల సమావేశం బుధవారం జరిగింది. దీనికి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. 106 సంవత్సరాల చరిత్ర గల తెలంగాణా ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) జూలై 3వ తేదీన హెచ్‌ఐసిసిలో 23 విభాగాల్లో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. మే 31 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని తెలిపింది. ఒక్కొక్కటి రెండు కేజీల వెండితో చేసిన ఒరిజినల్ ట్రోఫీలు ప్రదర్శించబడతాయని అనిల్ అగర్వాల్ తెలిపారు. 1974లో ఏర్పాటు చేసిన అవార్డులను గత 49 ఏళ్లుగా (మహమ్మారి కాలంలో మినహా) నిరంతరాయంగా అందిస్తున్నామన్నారు.

హైదరాబాద్‌లో దజోన్ సిఒఇ కేంద్రం ఏర్పాటు

- రూ.200 కోట్ల పెట్టుబడులు
- ఆ కంపెనీ సిఇఒ షే సెగెవ్ వెల్లడి

హైదరాబాద్ : ప్రముఖ గ్లోబల్ స్పోర్ట్స్ స్ట్రీమింగ్ సర్వీస్ సంస్థ దజోన్ హైదరాబాద్‌లో తన ప్రధాన టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ) ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. నాలెడ్జ్ సిటీలోని అరబిందో గెలాక్సీలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చామని దజోన్ గ్రూప్ సిఇఒ షే సెగెవ్ వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లో షే సెగెవ్ మీడియాతో మాట్లాడుతూ.. రూ.200 కోట్ల పెట్టుబడులతో.. 2023 డిసెంబర్ నాటికి 1000 మందిని నియమించుకోవాలని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ఐదు నెలల క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన తమ అత్యాధునిక కార్యాలయంలో ఇప్పటికే 350 మందికి పైగా పని చేస్తున్నారన్నారు. 2024 డిసెంబర్ నాటికి ఉద్యోగుల సంఖ్యను 2500కు పెంచనున్నామని తెలిపారు. "హైదరాబాద్‌లో టెక్నాలజీ సిఒఇని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. ఇది అందించే అదనపు సాంకేతిక సామర్థ్యం.. అత్యున్నత స్పోర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థగా మారడంలో మా రోడ్ మ్యాప్‌ను మరింత వేగవంతం చేస్తుంది." అని షే సెగెవ్ చెప్పారు. దజోన్ గ్రూపు చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సందీప్ టికు మాట్లాడుతూ, "అధునాతన స్ట్రీమింగ్ టెక్నాలజీల ఆవిర్భావం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ విజన్, ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఎఆర్), వర్చువల్ రియాలిటీ (విఆర్), వేరబుల్ టెక్నాలజీతో క్రీడాభిమానులు ఇంతకు ముందు ఎప్పుడూ చవిచూడని సరికొత్త అనుభవాన్ని వారికి అందించే సామర్థ్యం తమ సంస్థకు ఉందన్నారు.

త్వరలో నల్లగొండలో ఐటి టవర్

- ముందుకొచ్చిన సొనాటా సాఫ్ట్‌వేర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ పట్టణానికి ఐటీ పరిశ్రమ రానున్నది. త్వరలో ప్రారంభం కానున్న ఐటీ టవర్‌లో తన కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ సొనాటా ముందుకొచ్చింది. ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా నల్గొండ ఐటీ టవర్‌లో సుమారు 200 ఉద్యోగాలను సొనాటా సాఫ్ట్‌వేర్ కల్పించనున్నది.

సొనాటా సాఫ్ట్‌వేర్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు శ్రీని వీరవెల్లి మంత్రి కెటిఆర్‌తో అమెరికాలోని బోస్టన్ నగరంలో సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్, ఆరోగ్య రంగం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సేవలు అందించేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ఇన్నోవేషన్ల కోసం సొనాటా కార్యకలాపాలు నిర్వహించనున్నది. ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించనున్న కంపెనీ స్థానిక యువతకు టెక్నాలజీ రంగంలో నైపుణ్య శిక్షణ కల్పించనుంది. మంత్రి కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, పెట్టుబడుల ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ అమర్నాథ్‌రెడ్డి ఉన్నారు.

గుడిసెల కూల్చివేత

- అడ్డుకున్న మహిళలు
- వందలాది మంది అరెస్ట్
- చివరకు వెనుదిరిగిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు నిలువ నీడ కోసం వేసుకున్న గుడిసెలపై అధికార యంత్రాంగం మూకుమ్మడిగా దాడి చేసింది. గింత జాగ కోసం పోరాడుతున్న పేదలపై కనికరం చూపకుండా గుడిసెలు వేసుకుంటూ వుంటే.. తొలగిస్తూ వస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పోలీసులను తోడు తీసుకొచ్చుకుని తెల్లవారు జామునే గుడిసెల ప్రాంతానికొచ్చారు. అడ్డుకున్న పేదలను ఓ వైపు అరెస్టు చేస్తూనే.. మరోవైపు కూల్చివేతలు కానిచ్చారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమీపంలోని కురవి రహదారి వెంట బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి..

సర్వే నెంబర్ 255లో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ దాదాపు రెండు వేల మంది మూడు నెలల కిందట సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్నారు. అప్పటి నుంచి అధికార యంత్రాంగం ఐదుసార్లు వాటిని తొలగించినప్పటికీ మళ్లీ పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామునే ఆర్‌డిఒ కొమురయ్య, డిఎస్‌పి రమణబాబు, సిఐ రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాన్ని తీసుకొని గుడిసెల ప్రాంతానికి వచ్చారు. విషయం తెలుసుకున్న పేదలూ పెద్దఎత్తున తరలివచ్చి అధికారులను అడ్డుకున్నారు. ప్రొక్లైనర్‌ను, డోజర్ కదలకుండా మహిళలు అడ్డంగా కూర్చున్నారు. అయినా పోలీసుల సహకారంతో అధికారులు గుడిసెలను కూల్చివేస్తుండగా అడ్డుపోయిన

అధికారులు తీసుకొచ్చిన జెసిబి ముందు కుర్చున్న పేదలు

అయ్యగారిపెల్లి గ్రామానికి చెందిన జున్ను నరసమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కంచర్లగూడెం శ్రీను సొమ్మసిల్లి పడిపోయాడు.

సిపిఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్ణపు సోమయ్య, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం, ఎమగాని వెంకన్న, తోట శ్రీను, బూరుగుల లక్ష్మణ్, బానోతు శ్రీరామ్, గుడిసె వాసులు అధికార యంత్రాంగంతో వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వందలాదిగా వచ్చిన పోలీసులు గుడిసెవాసులను లాక్కెళ్లి డిసిఎంలో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు ఆకుల రాజు, అలువాల వీరయ్య, సమ్మెట రాజమౌళి, దెడ్డెల రాంమూర్తితో పాటు పేదలను అరెస్టు చేశారు. అనంతరం నాయకులు సోమయ్య ఆధ్వర్యంలో డిఎస్‌పి, ఆర్‌డిఒలతో చర్చలు నిర్వహించారు. గుడిసెలను తొలగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఆర్‌డిఒ కొమురయ్య మాట్లాడుతూ.. పూర్తి ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే.. ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారు. కానీ, ప్రభుత్వ భూములను ఆక్రమించడం సరికాదన్నారు. మూడు నెలలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని, ఎమ్మార్వో కార్యాలయంలో ఎన్నోసార్లు దరఖాస్తు ఇచ్చినా కనీసం పరిశీలించలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో పోలీసు, అధికార యంత్రాంగం వెనుదిరిగారు.

ఐవిఎఫ్ జంటలకు ఒయాసిస్ ఫెర్టిలిటీ సత్కారం

హైదరాబాద్ : ఐవిఎఫ్ ద్వారా గర్భం దాల్చిన జంటలను ఒయాసిస్ ఫెర్టిలిటీ సత్కరించింది. ఆ సంస్థ సికింద్రాబాద్ శాఖలో బుధవారం సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. "తల్లులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. తల్లితండ్రులు కావాలనే వారి కలలను సాధించుకోవడంలో సహాయపడటానికి అధునాతనమైన సంతానసాఫల్య చికిత్సలను అందిస్తున్నాము. వయస్సుతో పాటు సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతూ వస్తుంది, అందువల్ల సంతానం కోరుకునే జంటలు ఎటువంటి ఆలస్యం లేకుండా సంతాన సాఫల్య చికిత్స సహాయాన్ని పొందడం చాలా ముఖ్యం." అని సికింద్రాబాద్ ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినికల్ హెడ్ డాక్టర్ పరినాజ్ పర్వార్ పేర్కొన్నారు.

టిడిపి నూతన కార్యవర్గంలోకి మరో 28 మంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర కమిటీ విస్తరణలో భాగంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మరో 28 మందికి నూతన కార్యవర్గంలో చోటు కల్పించారు. పార్టీ చేనేత విభాగం అధ్యక్షుడుగా బడుగు దానయ్య (భువనగిరి), తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముంజా వెంకట రాజంను (స్టేషన్ ఘనపూర్) నియమించారు. ఈ మేరకు బుధవారం వీరికి నియామక ఉత్తర్వులను ఇచ్చారు. తాజా నియామకాలతో కలిపి తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గం సభ్యుల సంఖ్య 61కి చేరింది. బుధవారం ప్రకటించిన జాబితాలో రాష్ట్ర కార్యవర్గంలో ఒకరిని ఉపాధ్యక్షులుగా, ముగ్గురిని ప్రధాన కార్యదర్శులుగా, ఐదుగురిని అధికార ప్రతినిధులుగా, ఎనిమిది మందిని కార్యనిర్వాహక కార్యదర్శులుగా, పదకొండు మందిని కార్యదర్శులుగా నియమించారు. మరో విడతలో పూర్తి స్థాయి కమిటీ నియమిస్తామని కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. సీనియార్టీ, పనితీరు, ప్రాంతాలు, ఇతర సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని మహానాడు అనంతరం మరో విడత రాష్ట్ర కార్యవర్గాన్ని విస్తరిస్తామని చెప్పారు. అర్హులైన నాయకులకు పార్టీ అనుబంధ విభాగాల్లో అవకాశం కల్పిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రోత్సాహకం, సబ్సిడీ అందివ్వాలి
- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్
- తిరుమలగిరి పట్టుగూళ్ల డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పట్టు రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. తెలంగాణ పట్టు రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ తిరుమలగిరిలోని రాష్ట్ర పట్టుగూళ్ళ డైరెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. పట్టు రైతులకు తిరుమలగిరి పట్టు మార్కెట్‌లో చాలా కాలంగా అన్యాయం జరుగుతోందన్నారు. మధ్యవర్తులు, అధికారులు సరైన ధర ఇవ్వకుండా రైతులకు నష్టం చేకూర్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రైతులకు ప్రోత్సాహం, షేడ్ సబ్సిడీ, పని యంత్రాలు అందించాలని కోరారు. పట్టు రైతులకు మార్కెట్‌లో తగిన సదుపాయాలు కల్పించాలని, కనీస ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పట్టు రైతుల పట్ల మార్కెట్ అధికారులు వ్యవహరించే తీరు పూర్తిగా మారాలని కోరారు. పట్టుగూళ్లకు ఆంధ్ర, కర్ణాటక మార్కెట్లతో సమానంగా తిరుమలగిరి, జనగామ మార్కెట్‌లలో ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, పట్టుగూళ్లు అమ్మిన రోజే రైతు ఖాతాలో డబ్బులు జమ

డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పట్టు రైతులు

చేయాలని, జల్లిగూళ్ల నుంచి పట్టుగూళ్ల ధరలు 1/3 రేటు, డబుల్ గూళ్లకు 1/2 ధర ఇవ్వాలని అన్నారు. 2018 నుంచి రైతులకు రావాల్సిన ప్రోత్సాహక కమిషన్ రూ.75ను వెంటనే విడుదల చేయాలన్నారు. మినీట్రాక్టర్, ఇతర పట్టు వ్యవసాయ యంత్ర పరికరాలు, పట్టుపురుగుల రోగనిరోధకాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని కోరారు.

తెలంగాణ సెరికల్చర్ విభాగంలో ఉద్యోగ విరమణ పొందుతున్న శాస్త్రవేత్తలు, ఉద్యోగుల స్థానంలో కొత్త వారిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రంలో చాకి సెంటర్‌లను పెంచడం, పట్టుగూళ్ల డ్రయినేజీని వెంటనే ప్రారంభించాలని కోరారు. అనంతరం సహాయ కమిషనర్ సుధాకర్, మార్కెట్ అధికారి ఎం శివకుమార్‌ను కలిసి వినతపత్రం అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్.శ్రీధర్ రెడ్డి, మెరిండ్ల శ్రీనివాస్, పట్టు రైతులు ప్రవీణ్‌రెడ్డి, సక్రు అక్కిరం, అభిమన్య రెడ్డి, మండల రాజు, రఫిక్,రవీందర్, దేవిలల్, వినోద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి

- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల పెన్షన్ రూ. 10 వేలకు పెంపు కోసం దశల వారీగా ఉద్యమం చేస్తామనీ, సామాజిక భద్రత కల్పించాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య తెలిపారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని ఎన్‌పిఆర్‌డి కేంద్ర కమిటీ సభ్యులు జెర్కొని రాజు అధ్యక్షతన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 12.02 శాతం వికలాంగులు ఉన్నారని చెప్పారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా సంక్షేమ పథకాల్లో 12 శాతం వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవులలో వికలాంగులకు రిజర్వేషన్లు అమలుకు వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. వారి కుటుంబాలకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనీ, వైకల్య ధృవీకరణ పత్రం ఉన్న వారికి బస్సులు, రైల్వేలలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు.

మానసిక వికలాంగులు, మూగ,చెవిటి వికలాంగుల మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. 40 శాతం వైకల్యం

సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

కలిగిన వికలాంగులకు రాయితీ బస్సు పాసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు మూగ, చెవిటి, మానసిక వికలాంగులు, అంధులకు 40 శాతం వైకల్యం ఉంటే బస్సు పాసులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో వికలాంగులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి ఉచిత కోచింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి మధు బాబు, అరిఫ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పి. బలిశ్వర్, వి.ఉపేందర్, నాయకులు శశికళ, లింగయ్య, భుజంగ రెడ్డి, ప్రభు స్వామి, మోగులయ్య, బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌బి సంస్థకు టెండర్ ఎలా ఇస్తారు..?

- పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఒఆర్‌ఆర్ టెండర్ దక్కించుకున్న ఐఆర్‌బి సంస్థ లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చిన 30 రోజుల్లో.. టెండర్ మొత్తంలో పది శాతం అడ్వాన్స్‌డ్‌గా చెల్లించాలి. ఆ ప్రకారం ఐఆర్‌బి సంస్థ రూ. 7,388 కోట్లలో రూ.738 కోట్లను 30 రోజుల్లోగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే చెల్లించాల్సిన పది శాతం చెల్లించకుండా ఇంకా సమయం కోరుతోంది.. ఒప్పందాన్ని ఉల్లంఘించిన సంస్థపై చర్యలు తీసుకోకుండా దానికి అనుకూలంగా ఉండేలా అధికారులపై కెటిఆర్ ఒత్తిడి తీసుకువస్తున్నారు" అని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కెసిఆర్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిబంధనల మేరకు పది శాతం నిధులూ చెల్లించలేని ఐఆర్‌బి సంస్థకు టెండర్ ఎలా ఇస్తారు..? అని ప్రశ్నించారు. తక్షణమే ఈ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల సంపద అయిన ఒఆర్‌ఆర్‌ను ముంబయికి చెందిన ఐఆర్‌బి డెవలప్‌మెంట్ సంస్థకు సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అప్పటి సిఎస్ సోమేశ్ కుమార్ పర్యవేక్షణలో తెగనమ్మారని ఆరోపించారు. టెండర్ ప్రక్రియ మొదలు పెట్టినప్పటి నుంచి టెండర్‌కు సంబంధించిన లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చేంత వరకు జరిగిన దోపిడీని, దీని వెనుకాల ఉన్న పెద్దల ఆలోచనను పదే పదే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు వివరిస్తూ వచ్చిందని గుర్తుచేశారు.

బండి సంజయ్ మౌనమెందుకు..?

భారీ స్థాయిలో దారిదోపిడీ జరుగుతున్నా బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎందుకు ఫిర్యాదు చేయరు? బండి సంజయ్ ఒఆర్‌ఆర్ అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదు? బిఆర్‌ఎస్, బిజెపి మధ్య ఉన్న అవగాహన ఏమిటి? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఒఆర్‌ఆర్ టెండర్ ముసుగులో జరుగుతున్న దోపిడీని ప్రజాక్షేత్రంలో, చట్టపరమై చర్యల ద్వారా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని రేవంత్ రెడ్డి తెలిపారు.

సాలూరి కోటిని సత్కరిస్తున్న ప్రముఖులు

కోటి స్వర రచనలో కోటి స్వరాలు పలుకుతాయి

- ప్రముఖ సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

ప్రజాశక్తి - కల్చరల్

నవ రస భావాలను తన సంగీతం లో పలికించగల సాలూరి రాజేశ్వరరావు కుమారుడుగా సాలూరి కోటి స్వర రచనలో కోటి స్వరాలు పలుకుతాయని ప్రముఖ సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కొనియాడారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై ప్రగ్నిక ఫౌండేషన్ ప్రగ్నిక ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో సెల్వెల్ కార్పొరేషన్ సహకారంతో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రగ్నిక సప్తమ వార్షికోత్సవం సందర్భంగా సంగీత దర్శకుడు సాలూరి కోటికి స్వర సమ్రాట్ బిరుదు ప్రదానంతో సత్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా భరద్వాజ పాల్గొని కోటిని సత్కరించి మాట్లాడారు. కవులు రాసిన గీతం సినిమా మాధ్యమం ద్వారా ప్రచారంలోకి రావాలంటే ఉత్తమ సంగీతం ముఖ్యమన్నారు వాయిద్య హోరులో సాహిత్యం మరుగు పడకుండా ఉత్తమ స్వరాలు అందించగల నేర్పరి కోటి అని వివరించారు. దర్శకుడు రేలంగి నరసింహారావు, టిఎన్‌జిఒ నాయకుడు ముజీబ్, డిప్యూటీ రిజిస్ట్రార్ వెంకట రెడ్డి, మను పల్ల, కల్చరల్ టివి అధినేత పురుషోత్తం, మోహన్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొని కోటి ప్రతిభను ప్రశంసించారు. ప్రగ్నిక నిర్వహకుడు ప్రవీణ్ అధ్యక్షతన అఖిల, సురేఖ, సుజాత, బిందు నయన, సింహ శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్ తదితరులు నాటి నేటి పాటలను హృద్యంగా ఆలపించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

ఇంటర్మీడియరీ గొడౌన్లలో ధాన్యం దించాలి

- మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైస్ మిల్లుల వద్ద స్థలం లేకున్నా, మిల్లులు సహకరించకున్నా తక్షణం ఇంటర్మీడియరీ గొడౌన్లలో ధాన్యం దించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి ధాన్యం సేకరణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ... రాజకీయాలు పట్టించుకోకుండా రైతులు రోడ్లపైకి రాకుండా వారికి అండగా ఉండాలని సూచించారు. తాలు, తరుగు సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. రవాణా సమస్య రాకుండా ట్రాక్టర్లను కూడా ఉపయోగించుకోవాలని కోరారు. పక్క రాష్ట్రాల్లో కొనుగోళ్లు లేనందున అక్కడి ధాన్యం రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటర్మీడియరీ గోదాముల్లో దించే ధాన్యంతో మిల్లర్లకు ఎటువంటి సంబంధం ఉండకూడదని స్పష్టం చేశారు. అధికార యంత్రాంగం బాధ్యతతో వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.

2.915 కిలోల బంగారం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



విదేశాల నుంచి భారీఎత్తున బంగారం తరలిస్తుండగా శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో బుధవారం పట్టుబడింది. కస్టమ్స్ ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన వ్యక్తి దుబాయ్ నుంచి తెల్లవారుజామున 3 గంటల సమయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. అతని కదలికలపై అనుమానం వచ్చిన అధికారులు తనిఖీ చేశారు. ఆ బ్యాగులో ఎమర్జెన్సీ లైటు కనిపించింది. దానిని పరిశీలించగా బంగారం బయటపడింది. ఎమర్జెన్సీ లైట్‌లోని బ్యాటరీ స్థలంలో బంగారాన్ని ఉంచి తీసుకొచ్చినట్టు గుర్తించారు. బంగారం విలువ రూ.1,81,60,450/- ఉంటుంది. 2.915 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విత్తన భాండాగారంగా తెలంగాణ

- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- రాజేంద్రనగర్‌లో 'విత్తన మేళా - 2023'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను ప్రపంచానికే విత్తన భాండాగారంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇప్పటికీ రాష్ట్రం కొన్ని రకాల విత్తనాలను దిగుమతి చేసుకుంటున్నదని, భవిష్యత్తులో దీన్ని అధిగమించాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన "విత్తన మేళా-2023"ను మంత్రి ప్రారంభించారు. కొంత మంది రైతులకు విత్తనాలు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి తెలంగాణ ప్రభుత్వం రైతాంగ సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. సాగునీటి సౌకర్యం పెరిగిందన్నారు. తెలంగాణ ప్రాంతం విత్తనోత్పత్తికి చాలా అనుకూలమైందని చెప్పారు. రైతాంగం ఈ విషయంపై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణలో తయారయ్యే విత్తనాలకు ఇతర ప్రాంతాల్లో విపరీతమైన ఆదరణ ఉందన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ విషయాలపై శాస్త్రవేత్తలు రైతులకి నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా పశుపోషణకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆహారశుద్ధి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. వివిధ వంగడాలపై విశ్వవిద్యాలయం రూపొందించిన కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. ప్రదర్శనలను తిలకించి విత్తనాలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తన సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ కొండ బాల కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ కె.హనుమంతు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధీర్ కుమార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటరమణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి, విత్తన సంచాలకులు డాక్టర్ పి.జగన్‌మోహన్ రావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. విత్తన మేళాకు రైతులు తరలి వచ్చారు.